క్లుప్తంగా

పరిసరాల శుభ్రత పాటించాలి



అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

మడకశిరరూరల్: ప్రతి ఒక్కరూ పరిసరాల శుభ్రత పాటించి సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని డివిజన్ మలేరియా సబ్ యూనిట్ అధికారి కోదండరామిరెడ్డి సూచించారు. గురువారం ఆయన నీలకంఠాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. ప్రజలకు సకాలంలో వైద్య సేవలు అందించాలని తెలిపారు. అనంతరం డెంగీ నివారణపై నిర్వహించిన ర్యాలీలో పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించారు. డాక్టర్ జయవర్ధనరెడ్డి పాల్గొన్నారు.

మోరీని ఢీకొన్న కారు

- ముగ్గురికి స్వల్ప గాయాలు



దెబ్బతిన్న కారు

పావగడ: కారు పల్టీ కొట్టి ముగ్గురు స్వల్పంగా గాయపడ్డారు. ఈ ఘటన తిరుమణి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎర్రబెంచి గేటు వద్ద గురువారం చోటు చేసుకుంది. టాటా సోలార్ కంపెనీకి చెందిన ముగ్గురు ఉద్యోగులు కంపెనీ కారులో పావగడ వైపు వస్తుండగా ఎర్రబెంచి గ్రామ గేటు వద్ద వాహనం అదుపు తప్పి పల్టీలు కొట్టి మోరీని ఢీకొంది. కారు ఒక వైపు నుజ్జు నుజ్జయింది. అయితే అదృష్టవశాత్తూ డ్రైవర్‌తో సహా ముగ్గురు ఉద్యోగులు చిన్న పాటి గాయాలతో బయట పడ్డారు. అనంతరం ఆస్పత్రిలో చేరారు. ఘటన పై తిరుమణి పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

పారిశుధ్యం మరింత మెరుగుపడాలి



ఆజాద్‌నగర్‌లో కాల్వలు పరిశీలిస్తున్న కమిషనర్ ప్రమోద్‌కుమార్

హిందూపురం: పారిశుధ్యంపై నిర్లక్ష్యం చూపొద్దని, కాల్వల శుభ్రత, చెత్తసేకరణ ప్రక్రియ నిరంతరం కొనసాగాలని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ పారిశుధ్య సిబ్బందికి సూచించారు. గురువారం ఆయన 1వ వార్డు కొట్నూర్, 26వార్డు ఆజాద్‌నగర్ ప్రాంతాల్లో పర్యటించారు. మురుగుకాల్వలు, రోడ్ల పరిస్థితులు, తాగునీటి సరఫరా సదుపాయాలపై ఆరా తీశారు. పారిశుధ్యం మరింత మెరుగుపడాలని అధికారులకు సూచించారు. అనంతరం ఏఈ, శానిటరీ ఇన్‌స్పెక్టర్, ఇతర అధికారులతో సమావేశం నిర్వహించారు. అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తికావాలని, కొట్నూరు పార్కు అభివృద్ధి చేయాలని, ఆజాద్‌నగర్‌లో కాల్వల మరమ్మతు పనులు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో డీఈ నీరజా, ఏసీపీ రంగారావు, టీపీఓ రెహమాన్, ఏఈ నాగేంద్ర, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మారెన్న పాల్గొన్నారు.

క్యాలెండర్ల అందజేత

అమరాపురం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం మండలంలోని గ్రామ సచివాలయాల కార్యదర్శులకు సంక్షేమ క్యాలెండర్లను ఎంపీడీఓ మునిస్వామి అందజేశారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రభుత్వం ఏటా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను తేదీలతో సహా క్యాలెండర్లలో పొందుపరిచినట్లు తెలిపారు. గ్రామ సచివాలయాల్లో ఈ సంక్షేమ క్యాలెండర్లను ప్రదర్శించాలని సూచించారు.

ఘనంగా గంగమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే శంకరనారాయణ

గోరంట్ల: గొల్లపల్లిలో గంగమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. వేద పండితులు వేదమంత్రోచ్ఛారణ మధ్య విగ్రహ ప్రతిష్ఠాపన చేశారు. ఈ సందర్భంగా పూజలు, హోమాలు చేశారు. ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. గోరంట్ల మార్కెట్ యార్డు చైర్మన్ బూదిలి వేణుగోపాల్‌రెడ్డి, బూదిలి సర్పంచ్ రామాంజినేయులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన డీఎల్‌పీఓ

రొద్దం: నూతనంగా బాధ్యతలు చేపట్టిన డీఎల్‌పీఓ శివనారాయణరెడ్డి గురువారం పెనుకొండ ఎమ్మెల్యే శంకరనారాయణను ఆయన క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

రారెత్తిస్తున్న ఎండలు



వేసవి తాపాన్ని తట్టుకోలేకపోతున్న జనం

- ఈత కొలనులు, నీటి వనరుల్లో సేదతీరుతున్న యువత
- జన సంచారం లేక నిర్మానుష్యంగా ప్రధాన కూడళ్లు

హిందూపురం: వైశాఖ మాసంలో నిప్పుల వాన కురుస్తోంది. జిల్లాలో సూర్యప్రతాపం చండ ప్రచండం అవుతోంది. ఎన్నాడూ లేని విధంగా హిందూపురం పరిసరాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మడకశిర ప్రాంతాలతోపాటు ఇతర మండలాల్లో ఎండ వేడిమి ఏమాత్రం తగ్గడం లేదు. జిల్లాలో గరిష్టంగా గురువారం 42.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. పగలంతా ఎండలు దంచికొడుతుండగా సూర్యాస్తమయం తర్వాత గాలి వీచక ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఉదయం 11గంటల నుంచి రహదారుల్లో ప్రజలు రాకపోకలు తగ్గిపోతున్నాయి. ప్రధాన రహదారులు జనసంచారం లేక నిర్మానుష్యంగా మారుతున్నాయి. తీవ్రమైన వడగాల్పులతో జనం అల్లాడిపోతున్నారు. కొంతసేపు బజారులోకి వెళ్తే చాలు ప్రజలు నీడ వైపునకు పరుగులు తీయాల్సి వస్తోంది.ఎండ వేడమికి వడగాల్పులకు ఆరోగ్య సమస్యలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు, అధికారులు, ప్రజాప్రతినిధులు సూచిస్తున్నారు.



హిందూపురం ఆర్టీసీ బస్టాండ్ రహదారి వద్ద పెద్దగా జనసంచారం లేని దృశ్యం

పరిగి: వారం రోజులుగా ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. మూడు రోజులుగా 40 డిగ్రీల వరకూ నమోదవుతున్నాయి. సాయంత్రం 6 గంటలైనా ఉక్కపోత తగ్గడం లేదు. వృద్ధులు, చిన్నారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రి వేళలో సైతం ఇళ్లలో ఉక్కపోత భరించలేక పిల్లతో కుటుంబమంతా ఆరుబయట నిద్రిస్తున్నారు. వేసవి తాపం నుంచి ఊరట పొందేందుకు మండలంలోని మోదా సమీపంలో ఉన్న ఈత కొలనుకు జనం పోటెత్తుతున్నారు. బావులు, కాలువల్లో ఈత కొడుతూ ఎండ నుంచి ఉపశమనం పొందుతున్నారు.

తేది	గరిష్ట ఉష్ణోగ్రతలు	కనిష్ట ఉష్ణోగ్రతలు
18-05-23	42.9	21.3
17-05-23	40.9	22.5
16-05-23	41.2	23.8
15-05-23	39.7	23.4
14-05-23	39.7	23.4
13-05-23	41.3	23.7
12-05-23	40.3	23.8
11-05-23	40.1	23.3



పరిగిలో ఈత కొడుతున్న యువత

శరీరంలో నీటి శాతం తగ్గకుండా జాగ్రత్తపడాలి



శరీరంలో 105.1 ఫారిన్‌హీట్ కంటే ఎక్కువగా ఉండటం, శరీరం పొడిబారడం వంటిలక్షణాలు కనిపించిన వారు అధికంగా మంచి నీరు సేవించాలి. ఎండల్లో తిరగరాదు. వదులుగా ఉండే కాటన్ దుస్తులు ధరించాలి. ఆహారం తక్కువ మోతాదులో ఎక్కువ సార్లు తీసుకోవాలి. పిల్లలు, గర్భిణులు, వృద్ధులు వడదెబ్బ తగలకుండా అప్రమత్తంగా ఉండాలి. ఉదయం 11నుంచి 4గంటలకు వరకు వీలైంత వరకు ఇంటివద్దనే ఉండటం మంచిది.

-డాక్టర్ రోహిల్, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్, హిందూపురం

ఓట్ల కోసమే ఎన్టీఆర్ భజన చేస్తున్న చంద్రబాబు

- ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాలు నిర్వహించే హక్కు టీడీపీకి లేదు
- టీడీపీలో దళితులకు అవమానం
- మడకశిరలో ఎన్టీఆర్ జయంతి ఉత్సవాల సభ అట్టర్ ఫ్లాప్
- ఎమ్మెల్యే తిప్పేస్వామి



ఎమ్మెల్యే తిప్పేస్వామి

మడకశిర: ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాలను నిర్వహించే హక్కు టీడీపీకి లేదని ఎమ్మెల్యే తిప్పేస్వామి గురువారం ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు. ఎన్టీఆర్‌ను వెన్నుపోటు పొడిచిన చంద్రబాబు.. ఈరోజు ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాలను నిర్వహించడం కేవలం ఓట్ల కోసమేనని విమర్శించారు. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు ఏనాడు ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలని అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపలేదని తెలిపారు. వైఎస్ జగన్.. ఎన్టీఆర్‌పై ఉన్న గౌరవంతో కృష్ణా జిల్లాకు ఎన్టీఆర్ పేరు పెట్టారని తెలిపారు. చంద్రబాబు మాటలను ఎన్టీఆర్ అభిమానులు నమ్మి మోసపోవద్దని కోరారు. ఎన్టీఆర్‌ను అవమానించిన చంద్రబాబుకు వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని ఎన్టీఆర్ అభిమానులకు సూచించారు. టీడీపీలో దళితులకు గౌరవం లేదని తెలిపారు. మడకశిర నియోజకవర్గంలో టీడీపీలోని దళితులకు జరుగుతున్న అవమానమే ఇందుకు నిదర్శనమని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ దళితులకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. దళితులందరూ వైఎస్ జగన్‌కు అండగా ఉండాలని కోరారు. కాంగ్రెస్‌లో ఉన్నప్పుడు ఎన్టీఆర్, చంద్రబాబును తిట్టిన వ్యక్తి ఈరోజు మడకశిర టీడీపీలో పెద్ద నాయకుడిగా చలామణి అవుతూ ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాలను నిర్వహించడం విడ్డూరంగా ఉందని ఆయన విమర్శించారు. మడకశిరలో నిర్వహించిన ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాల సభ అట్టర్ ఫ్లాప్ అయిందని తెలిపారు.

ప్రతి కార్యకర్తకూ న్యాయం చేస్తా

పెనుకొండ: కార్యకర్తలే పార్టీకి వెన్నుదన్ను అని, వారికి ఎలాంటి సమస్యలు వచ్చినా అండగా ఉంటూ ఆదుకుంటామని ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ వైఎస్సార్‌సీపీ శ్రేణులకు హామీ ఇచ్చారు. రొద్దం మండలం రెడ్డిపల్లికి చెందిన విజయభాస్కరరెడ్డి కొంత కాలంగా పార్టీకి దూరంగా ఉంటున్నారు. గురువారం సాయంత్రం పలువురు ముఖ్య వైఎస్సార్ సీపీ నాయకులతో కలసి ఎమ్మెల్యేను ఆయన స్వగృహంలో కలిశారు. పార్టీ అభ్యున్నతికి పాటుపడుతానని పేర్కొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుందన్నారు. జగనన్నను మరోమారు ముఖ్యమంత్రిగా చేయడానికి ప్రతి ఒక్కరూ కలసి రావాలని పేర్కొన్నారు. ఏ ఒక్కరినీ ఇబ్బంది పెట్టాలన్నది తన లక్ష్యం కాదని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పెనుకొండ ఎంపీపీ గీత, ముఖ్య నాయకులు రామ్మోహన్ రెడ్డి, సోమందేపల్లి జెడ్పీటీసీ అశోక్, కన్వీనర్ నారాయణరెడ్డి, మాజీ కన్వీనర్ వెంకటరత్నం ఉపసర్పంచ్ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే శంకరనారాయణను సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు విజయభాస్కరరెడ్డి

ఫుట్‌బాల్ క్రీడలో అమ్మాయిలకు అవకాశాలు

హిందూపురం టౌన్: ఫుట్‌బాల్ ఆటలో అమ్మాయిలకు ఎక్కువ అవకాశాలు ఉన్నాయని రాష్ట్ర సీనియర్ మహిళా జట్టు కెప్టెన్ షేక్ షబానా అన్నారు. పట్టణంలోని ఎస్‌డీజీఎస్ క్రీడా మైదానంలో యునైటెడ్ ఫుట్‌బాల్ క్లబ్ ఆధ్వర్యంలో జరుగుతున్న సమ్మర్ కోచింగ్ క్యాంప్‌ను ఆమె సందర్శించారు. శిక్షణ తీసుకుంటున్న ఆటగాళ్లకు ఫుట్‌బాల్ క్రీడలోని పలు మెళకువలను నేర్పించారు. ఫుట్‌బాల్ ఆటలో పోటీ తక్కువగా ఉందని, మెరుగ్గా రాణిస్తే రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించే అవకాశం ఉంటుందన్నారు. అమ్మాయిలను తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. అనంతరం ప్రతిభ కనబరిచిన ఆటగాళ్లకు ప్రశంసాపత్రాలను అందజేశారు. యూనైటెడ్ క్లబ్ మేనేజింగ్ డైరెక్టర్ శేఖర్, ప్రోగ్రామ్ డైరెక్టర్ మహమ్మద్ సలీమ్, కోచ్ చంద్రశేఖర్, సీనియర్ ఆటగాళ్లు నాగరాజు, పవన్‌కుమార్, వినోద్, న్యాయవాది శివశంకర్ పాల్గొన్నారు.



ఫుట్‌బాల్ క్రీడాకారులకు ప్రశంసాపత్రాలు అందజేసిన దృశ్యం

సభ్యులకు కనీస సమాచారం ఇవ్వరా?

సోమందేపల్లి: అభివృద్ధి పనులపై మండలంలోని కొన్ని గ్రామ సచివాలయాల్లో సిబ్బంది, మండల అధికారులు కనీస సమాచారం ఇవ్వటం లేదని సర్పంచ్‌లు ఎంపీటీసీ సభ్యులు ధ్వజమెత్తారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో ఎంపీపీ గంగమ్మ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. సర్పంచ్‌లు జిలాన్ ఖాన్, కిష్టప్ప, పరంధామ, ఎంపీటీసీ నాగమ్మ, కో ఆప్షన్ సభ్యుడు రఫీక్ మాట్లాడుతూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకువస్తున్నారని మండిపడ్డారు. సభ్యులు లేవనెత్తిన సమస్యల పరిష్కారానికి అధికారులు చొరవ తీసుకోవాలని జెడ్పీటీసీ అశోక్ సూచించారు. ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ సౌజన్య లక్ష్మి, ఎంఈఓ ఆంజినేయులు నాయక్, హౌసింగ్ ఏఈ నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమస్యలను ప్రస్తావిస్తున్న సభ్యులు

40శాతం రాయితీతో విత్తన వేరుశనగ

- ఆర్బీకేల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం
- రైతులు పేర్లు నమోదు చేసుకోవాలి
- ఏడీఏ కృష్ణమీనన్

మడకశిర: ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ సాగు చేయడానికి 40 శాతం సబ్సిడీతో ప్రభుత్వం వేరుశనగ విత్తనకాయలు అందిస్తున్నట్లు ఏడీఏ కృష్ణమీనన్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆర్‌బీకేల్లో రైతులు పేర్లు నమోదు చేసుకునే ప్రక్రియ ప్రారంభమైందని తెలిపారు. అర ఎకరా ఉన్న రైతులకు ఒక బస్తా(30 కేజీలు), ఎకరా ఉన్న రైతులకు 2 బస్తాలు(60 కేజీలు), ఎకరాకుపై బడి ఉన్న రైతులకు 3 బస్తాల (90కేజీలు) చొప్పున అందిస్తామని తెలిపారు. కే–6 రకం విత్తనం ఒక బస్తాకు (30కేజీలు) సబ్సిడీ పోను రూ.1,674, రెండు బస్తాలకు రూ.3,348, మూడు బస్తాలకు రూ.5,022 చొప్పున ధర నిర్ణయించినట్లు తెలిపారు. కదిరి లేపాక్షి రకం విత్తనం ఒక బస్తాకు (30కేజీలు) సబ్సిడీ పోను రూ.1,494, రెండు బస్తాలకు (60కేజీలు) రూ.2,988,మూడు బస్తాలకు (90 కేజీ లకు) రూ.4,482 చొప్పున ధర నిర్ణయించినట్లు తెలిపారు. పేర్ల నమోదు ప్రక్రియ పూర్తి కాగానే ఆర్బీకేల పరిధిలోనే రైతులకు విత్తనాన్ని అందిస్తామని తెలిపారు.

లేపాక్షి: మండల వ్యాప్తంగా 12 రైతు భరోసా కేంద్రాల్లో గురువారం నుంచి వేరుశనగ విత్తనం కావాల్సిన రైతులు పేర్లు నమోదు చేసుకోవాలని వ్యవసాయాధికారి శ్రీలత తెలిపారు. రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు, మొబైల్ నంబర్ తీసుకుని రైతు భరోసా సిబ్బందిని సంప్రదించాలన్నారు. ఈనెల చివరన విత్తన పంపిణీ మొదలవుతుందన్నారు.

మడకశిరరూరల్: సబ్సిడీతో అందించే వేరుశనగ విత్తన కాయల కోసం రైతులు ఆర్‌బీకేల్లో పేర్లు నమోదు చేసుకోవాలని ఏఓ వీరనరేష్ తెలిపారు. రైతులు పట్టాదారుపాస్ పుస్తకం, ఆధార్ కార్డు వెంట తీసుకెళ్లి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

సంక్షిప్త సమాచారం

పాఠశాలను పరిశీలించిన డీఈఓ



తరగతి గదిని పరిశీలిస్తున్న డీఈఓ మీనాక్షి

చిలమత్తూరు: మండల కేంద్రంలోని పొట్టిశ్రీరాములు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం డీఈఓ మీనాక్షి పరిశీలించారు. పలు రికార్డులను పరిశీలించారు. పాఠశాలకు మంజూరైన ఎనిమిది అడిషనల్ క్లాస్ రూమ్‌లను రెండుకు తగ్గించడంపై ఆరా తీశారు. గదులు మంజూరైనా ఎందుకు వినియోగించలేదని హెచ్‌ఎంను ప్రశ్నించారు. ఎస్‌ఎంసీ చైర్మన్, పాఠశాల హెచ్‌ఎంతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఎంపీడీఓ రామ్‌కుమార్, ఎంఈఓ నాగరాజు,హెచ్‌ఎం జయప్రద, జెడ్పీటీసీ అనూష, రాజారెడ్డి పాల్గొన్నారు.

పోస్టర్ల విడుదల

పెనుకొండ: ఆటో డ్రైవర్ల సమస్యలపై ఈనెల 23న నిర్వహించనున్న చలో కలెక్టరేట్‌కు సంబంధించిన పోస్టర్లను సీఐటీయూ జిల్లా కార్యదర్శి రమేష్ గురువారం పట్టణంలో విడుదల చేశారు. నాయకులు బాబా, బాబావలి, తిప్పన్న పాల్గొన్నారు.

ఏపీఓ నాగరాజు బదిలీ

రొళ్ల: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పథకంలో ఏపీఓగా పని చేస్తున్న నాగరాజు అన్నమయ్య జిల్లాకు బదిలీ అయినట్లు ఎంపీడీఓ రామారావు గురువారం తెలిపారు.

రెండు సెల్‌ఫోన్లు చోరీ

సోమందేపల్లి: సోమందేపల్లిలో గురువారం రెండు సెల్‌ఫోన్లు చోరీ అయ్యాయి. వారపు సంతలో ఓ వ్యక్తి వద్ద జేబులో నుంచి ఫోన్‌ను దుండుగులు అపహరించారు. సాయంత్రం ఎన్టీఆర్ సర్కిల్ వద్ద సిరి మొబైల్ షాపు వద్ద ఆన్‌లైన్‌లో నగదు విత్‌డ్రా చేయడానికి వచ్చిన మరో వ్యక్తి నుంచి ఫోన్ ఎత్తుకెళ్లారు. సీసీ కెమెరాలను పరిశీలించి నిందితుల కోసం గాలిస్తున్నట్లు ఏఎస్‌ఐ మురళి తెలిపారు.

రికార్డులు పక్కాగా నిర్వహించాలి



రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ మునిస్వామి

అమరాపురం: గ్రామ సచివాలయాల్లో రికార్డులను పక్కాగా నిర్వహించాలని ఎంపీడీఓ మునిస్వామి అధికారులకు సూచించారు. ఆలదపల్లి గ్రామ సచివాలయాన్ని గురువారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులు, హాజరు పట్టికను పరిశీలించారు.సమయపాలన పాటించాలని, అర్జీలను పరిశీలించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం చెత్తతో సంపద తయారీ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. గ్రీన్ అంబాసిడలర్ల ద్వారా రోజూ చెట్లకు నీటిని పోయించాలని సూచించారు. కార్యదర్శి గౌరమ్మ, సిబ్బంది సర్పంచ్ గిరిజమ్మ పాల్గొన్నారు.

నీటి ఎద్దడి తలెత్తకుండా చూడండి

రొళ్ల: అన్ని గ్రామాల్లో సర్పంచుల సహకారంతో తాగునీటి ఎద్దడి నివారణ కోసం చర్యలు తీసుకోవాలని ఈఓఆర్డీ కృష్ణప్ప కార్యదర్శులకు సూచించారు. ఈమేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. వాటర్ స్కీమ్ పథకం కింద ఏర్పాటు చేసిన విద్యుత్ మోటార్లు మరమ్మతులకు గురై ఉంటే రిపేరీ చేయించి నీటి సమస్యను తీర్చాలన్నారు.

పొలాలకు ఉచితంగా మట్టి తరలింపు

సోమందేపల్లి: ఈదులబలాపురం గ్రామంలో సెడ్స్ సంస్థ ఆధ్వర్యంలో రైతులకు ఉచితంగా పొలాలకు మట్టి తరలించినట్లు సంస్థ సీఈఓ మానీల్ జోష్వ తెలిపారు.

వైభవంగా శనిమహాత్మ జయంతి

పావగడ: పావగడలో వెలసిన ప్రఖ్యాత శ్రీ శనీశ్వరాలయంలో శని మహాత్ముని జయంతి వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. గురువారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విశేష పూజలు నిర్వహించారు. స్వామి వారికి తైలాభిషేకాలు, నవగ్రహ పూజలు, మంగళ హారతులు నేత్రపర్వంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు అనంతరాం భట్ నేతృత్వంలో వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య మహా గణపతి, లలితా సహస్ర నామం, పూర్ణాహుతి హోమాలు ఘనంగా నిర్వహించారు. ప్రధానంగా శని మహాత్ముడు జన్మించిన వైశాఖ బహుళ అమావాస్య శుక్రవారం రోజున సాయంత్రం శ్రీ జ్యేష్ఠాదేవి సమేత శ్రీ శనీశ్వర స్వామి దీపాలంకృత ఉత్సవం జరగనుంది. ఈనేపథ్యంలో భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు అందుకోవాలని ఆలయ సమితి అధ్యక్షుడు కేవి శ్రీనివాస్ కోరారు.



హోమం నిర్వహిస్తున్న వేద పండితులు

నారాయణ పాఠశాలపై చర్యలకు డిమాండ్



ధర్నా చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

హిందూపురం టౌన్: పట్టణంలోని నారాయణ పాఠశాల నిబంధనలు ఉల్లంఘించి ముందస్తు అడ్మిషన్లు, ప్రచారాలు నిర్వహిస్తోందని, విద్యాశాఖ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం స్థానిక నారాయణ పాఠశాల ఎదుట ధర్నా చేపట్టారు. జిల్లా కార్యదర్శి బాబావలి మాట్లాడుతూ యూకేజీ నుంచి పదవ తరగతి వరకు రూ.26 వేల నుంచి రూ.40వేల వరకు ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. విద్యార్థులకు కనీస క్రీడా మైదానం, మౌళిక సదుపాయాలు లేవన్నారు. బుక్స్, టై, షూ తదితర వాటిని ఇక్కడే కొనాలంటూ నిబంధనలు పెట్టి రూ.6వేలనుంచి రూ.12వేల వరకు అదనంగా వసూలు చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నారాయణ పాఠశాలపై చర్యలు తీసుకోవాలన్నారు. నాయకులు తరుణ్, నిహాల్, నవీన్, మహేష్, లిఖిత్, ఆదర్శ్, సిరాజ్, నందీష్ తదితరులు పాల్గొన్నారు.



ఉష్ణోగ్రత సమాచారం

(గరిష్టం)

హిందూపురం	42.09
పెనుకొండ	41
మడకశిర	39

23న మండల సమావేశం

రొద్దం: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశపు భవనంలో ఈనెల 23న ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రాబర్ట్‌విల్సన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరు కావాలన్నారు.

20న సమావేశం

లేపాక్షి: మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 20వ తేదీన ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ వెంటకరత్నమ్మ అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీఓ తెలిపారు.

నేడు గడప గడపకూ....

మడకశిర(అగళి): అగళి మండలంలోని కెంకెర, వడగుంటనహళ్లి, ఉప్పరతొణసనహళ్లి గ్రామాల్లో శుక్రవారం ఉదయం 7.30 గంటలకు గడప గడపకూ మనప్రభుత్వం కార్యక్రమం ప్రారంభమవుతుందని ఎంపీడీఓ నరేంద్రకుమార్ తెలిపారు. ఎమ్మెల్యే తిప్పేస్వామి హాజరవుతారన్నారు.

20న కురుబవాండ్లపల్లిలో...

పెనుకొండ రూరల్: మండలంలోని కురుబవాండ్లపల్లి గ్రామంలో శుక్రవారం ఉదయం 7 గంటలకు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ఉంటుందని సర్పంచ్ నాగమూర్తి తెలిపారు. ఎమ్మెల్యే శంకరనారాయణ పాల్గొంటారన్నారు.

ఫార్మాసిస్టు మృతి



ఫక్రోద్దీన్(ఫైల్)

రొద్దం: రోడ్డు ప్రమాదానికి గురై బెంగళూరులోని ఆస్పత్రిలో చికిత్స పొంది ఇంటికి చేరుకున్న మండల కేంద్రానికి చెందిన ఫక్రోద్దీన్(54) గురువారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు చెప్పారు. పెనుకొండ మండలం గుట్టూరు ప్రభుత్వ ఆస్పత్రిలో ఫార్మసిస్టుగా విధులు నిర్వహిస్తున్న ఈయన విధులు ముగించుకుని రొద్దంకు వస్తూ ఎల్‌జీబీనగర్ సమీపాన జింకను ఢీకొని గాయపడ్డాడు. చికిత్స పొంది బుధవారం రాత్రి ఇంటికి చేరిన ఆయన గురువారం మృతి చెందారు. ఫక్రోద్దీన్ భౌతికకాయానికి ఆరోగ్య సిబ్బంది నివాళులర్పించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కొడుకులు ఉన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి



మహమ్మద్ అలీ (ఫైల్)

హిందూపురం: హిందూపురం మండలం సంతేబిదనూర్ గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు మహమ్మద్ అలీ బుధవారం అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ మహమ్మద్‌ఇక్బాల్ అలీ కుటుంబాన్ని ఫోన్ ద్వారా పరామర్శించారు. కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ ఘనీ, మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాల్ రెడ్డి, సర్పంచ్ లలిత, నాయకులు లతీఫ్, బసిరెడ్డి, కట్లాబాషా, హుమయూన్, దాదు తదితరులు వెళ్లి మహమ్మద్ అలీ భౌతికకాయానికి నివాళులర్పించారు.

ఎమ్మెల్యే వెంకటేశ్‌కు మంత్రి పదవి ఇవ్వాలి



గుమ్మఘట్ట శ్రీనివాస్

పావగడ: పావగడ కాంగ్రెస్ ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేశ్‌కు మంత్రివర్గంలో చోటు కల్పించాలని స్థానిక సీనియర్ కాంగ్రెస్ నేత గుమ్మఘట్ట శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. ఈమేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ 10 వేలకుపైగా మెజారిటీతో గెలిచి వరుసగా రెండో సారి కాంగ్రెస్‌ను గెలిపించిన ఎమ్మెల్యే వెంకటేశ్‌కు మంత్రి పదవి ఇచ్చి తాలూకా అభివృద్ధికి తోడ్పడాలని అధిష్ఠానాన్ని కోరారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

చిలమత్తూరు: ఉపాధి పనుల పెండింగ్ బిల్లులు కూలీల బ్యాంక్ ఖాతాలకు జమ చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. చాగలేరు పంచాయతీలోని చాగలేరు, శానిగానిపల్లి గ్రామాల్లో ఉపాధి పనులను పరిశీలించారు.

ట్రస్టు ప్రారంభం

గుడిబండ: కరికెర గ్రామంలో ఏర్పాటు చేసిన సుధాకిరణాలు చారిటబుల్ ట్రస్టును గురువారం మాజీ ఎమ్మెల్యే సుధాకర్ ప్రారంభించారు. ట్రస్టు ద్వారా అందించే సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడు కిరణ్‌కుమార్, సుందర్ రాజు, సినీ దర్శకుడు ధనరాజు పాల్గొన్నారు.